


# పిరికివాడి అంతరాత్మ

**వాసిరెడ్డి సీతాదేవి**

జీపు దిగి లోపలకు వచ్చిన హరికృష్ణ, డ్రాయింగు రూంలోని సోఫాలో వాలి కూర్చున్నాడు అలసటగా. ఎదురుగా టీపాయ్‌మీద ఉత్తరాలు వున్నాయి. యాంత్రికంగా వాటికేసి చూశాడు.

"సర్‌! హైదరాబాద్‌నుంచి మీకు టెలిఫోన్ మెసేజ్ వచ్చింది. ఎల్లుండి ఫామిన్ రిలీఫ్ మీటింగు వున్నదట.' అంటూ క్యాంప్ క్లర్క్ సవినయంగా పాడ్ అందించాడు.

పాడ్‌చూపి, తిప్పి ఇచ్చేస్తూ టీపాయ్ మీద వున్న ఉత్తరాలకేసి చూశాడు. పచ్చ సిరాతో "పర్సనల్" అని రాసివున్న కవరుమీద అతని కళ్ళు నిల్చాయి. బుర్రలో ఏదో ఆలోచన తళుక్కున మెరిసింది. కళ్లు సంతోషంతో వెలిగాయి.

"కోటుకూడా విప్పకుండా అలా కూర్చున్నారేం!"

భార్యకంఠం వినగానే, ఉత్తరం కొరకు ముందుకుచాచిన హరికృష్ణ చెయ్యి ఎవరో గుంజినట్టు ఒక్కసారిగా వెనక్కి పోయింది.

"ఆఁ ఆ!! ఏం లేదు. కొంచెం అలసటగా వుంటేనూ...." అంటూ భార్య ముఖంలోకి చూశాడు.

వంటమనిషిని కేకపెట్టి కాఫీ తీసుకు రమ్మని పురమాయించింది సరోజ.

హరికృష్ణకు భార్యమీద వళ్లు మండి పోయింది. ఆ కాఫీ తనే తీసుకు రాకూడదూ? మొగుడు అలిసివస్తే వంటవాణ్ణి కాఫీ తీసుకురమ్మని కేకలు పెడుతూ ఎదురుగా కూర్చొనే ఆడవాళ్లను ఏమనాలి?

హరికృష్ణకు ఆ ఉత్తరం చదవాలని ఆత్రంగా వుంది. మరోవైపు అల్‌సేషన్ డాగ్‌లాంటి తన పెళ్ళాం ఎక్కడ పసి కడుతుందోనని భయంగానూ వుంది.

సరోజ ఎదురు కుర్చీలో కూర్చుని స్వెట్టర్ అల్లుతూంది. ఏదేదో చెబుతూంది. హరికృష్ణ వింటున్నట్టే కూర్చున్నాడు. ఒక మామూలు అఫిషియల్ కవరు చేతిలోకి తీసుకొని ఎప్పుడూ, చూడనట్టే పచ్చసిరా ఉత్తరంకేసి చూశాడు.

అవును....ఆ ఉత్తరం తప్పక ఆమే రాసివుంటుంది. ఆడవాళ్ళ దస్తూరి....తెలుస్తూనే వుంది. తన ఉత్తరానికి అనుకున్న దానికంటే త్వరగానే ఆమె జవాబు వ్రాసింది.

"కాఫీ తీసుకోండి!"

హరికృష్ణ ఉలిక్కి పడ్డాడు. భార్య చేతిలోని కాఫీ అందుకున్నాడు.

"బావగారు ఇవ్వాళ ఇంకా క్యాంపు నుంచి తిరిగివచ్చినట్టు లేదే?" అన్నది మరదలు పిల్ల. మరదలూ, మామగారూ ఎప్పుడు వచ్చి కూర్చున్నారో గమనించ లేదు హరికృష్ణ.

మరదలు వేసిన జోక్‌ను అర్థం చేసుకొనే మూడ్‌లో లేడు హరికృష్ణ. మరదలు ముఖంలోకి చూశాడు.

"అమ్మాయ్ జోక్ అల్లుడికి అర్థం కాలేదు." చుట్టపొగ గుప్పుగుప్పున వదిలి

గుబురు మీసాలు కదిలేలా నవ్వాడు మామగారు.

హరికృష్ణ భార్య ముఖంలోకి చూశాడు. ఆమె ముసిముసిగా నవ్వుకుంటూ, తప్పు పోయిన స్వెట్టర్ విప్పుతూ వుంది.

హరికృష్ణకి వళ్లు మండిపోయింది. ఈ పెళ్ళికాని మరదళ్ళకు వేరే పని వుండదు. అక్క ఇంట్లో తిష్టవేసి బావగార్లతో సరసాలు సాగిస్తారు. మామగార్ళకు అసలే బుద్ధివుండదు. కూతుర్నికని అల్లుణ్ణి సంపాదించి, ఏదో ఘనకార్యం చేసినట్టు నడ్డి విరుచుకుంటూ తిరగడమే కానీ సందా, అల్లుడు కొంచెం పలుకుబడి, హోదాగలవాడైతే, అల్లుడింట్లోనే పెళ్లికాని చిన్న కూతుర్తో సహా వచ్చి తిష్టవేస్తారు.

హరికృష్ణకు తన గుట్టు తెలుసుకోవాలని కూర్చున్న సి. ఐ. డీ. లాగా కన్పించాడు మామగారు. ఆ ఉత్తరం తీసుకొని దూరంగా వెళ్ళి చదువుకోవాలని వుంది. కాని దాన్ని అందుకోవాలంటేనే భయంగా వుంది. మూడు జతల కళ్లు తననే పరిశీలిస్తున్నట్టు అనిపించింది హరికృష్ణకు.

ఎందుకు తనింత భయపడుతున్నాడు. ఆ ఉత్తరం అందుకోవడానికి?

అవును! ఆ మార్గం తనకు కొత్త. తన చుట్టూవున్న ప్రపంచం తనకు బాగా అలవాటయిన ప్రపంచం— ఆఫీసు-నబార్డినేట్సూ హోదాకు తగిన స్నేహితులూ తను తప్పుమార్గంలో కాలు పెట్టక ముందే కాపరానికివచ్చిన భార్యా ఇద్దరు పిల్లలూ, ఇదీ తనలోకం. తనకు తెలిసిన లోకం. ఈ లోకంలో ఇంతకాలం ముక్కుకు సూటిగా నడుస్తున్నాతను, అనుకోకుండా అడ్డం తిరిగి పక్కమార్గంలో కాలుపెట్టే ప్రయత్నంలో ఆగిపోయాడు. ఆ కొత్త మార్గంలో అడుగు పెట్టే సాహసం తనకు లేదేమో అనిపిస్తుంది.

అనుకోకుండా హరికృష్ణ కళ్ళు పచ్చసిరా కవరుమీద నిల్చాయి. కళ్ళల్లోని వెలుగు సరోజ గుర్తిస్తాందేమోననే భయంతో, లేచి కోటు విప్పి హేంగర్‌కు తగిలించాడు.

సరోజ, చెల్లెలితో తండ్రితో మాట్లాడుతూవుంది. హరికృష్ణ ఆలోచనల్లో పడ్డాడు.

తను తప్పు మార్గంలో కాలు పెట్టబోవడంలేదు కదా? ఆ మార్గం తప్పుమార్గం అని ఎందు కనుకోవాలి. తను మగవాడు, తనకు ఆ మాత్రం స్వేచ్ఛ వుండక్కర్లేదా? చిన్నప్పటినుంచీ బంగారు పంజరంలోనే పెరిగిన చిలుకకు తన జీవితం బాగానే వున్నట్టు అన్పిస్తుంది. దాంతోనే తృప్తిపడటం నేర్చుకుంటుంది. కాని అప్పుడప్పుడు లాలస నిండిన నేత్రాలు వినీలాకాశం కేసి పరుగులు తీస్తాయి. ఆ ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పక్షుల్ని చూసి తనకూ అటువంటి స్వేచ్ఛ కావాలని కోరుతుంది. ఒకరోజు అది, తను తెరచివున్న పంజరంలో వున్నట్టు తెలుసుకుంటుంది. యజమాని పంజరం మూయడం మర్చిపోయాడు. కిటికీలో నుండి బయటికి చూస్తుంది. ఇంటి ముందున్న మామిడిచెట్టుమీద కూర్చున్న చిలుక తనను ఆహ్వానిస్తుంది. యజమాని లేడు. పంజరం తెరిచివుంది. ఎదురుగా చెట్టుకొమ్మమీది నేస్తం పిలుస్తూంది. ఒక్కసారి బయటికివెళ్ళి, నేస్తంతోపాటు వినీలాకాశంలో కొంచెంసేపు విహరించి, మళ్లీ యజమాని తిరిగివచ్చేటప్పటికి ఏమీ తెలియనట్టువచ్చి పంజరంలో కూర్చుంటే తప్పా? అది అపరాధమా? కాని ఒకవేళ ఆ చిలుక ఒకసారి స్వేచ్ఛను అనుభవించాక, తిరిగి పంజరంలోకి రావడానికి ఇష్టపడకపోతే? ఇష్టపడక ఏం చేస్తుంది? చిన్నప్పటినుంచీ నిర్ణీతపరిధిలో పెరిగిన ఆ చిలుకకు అంత స్వేచ్ఛను ఏం చేసుకోవాలో తెలియవద్దూ?

తన ఆలోచనలకు ముసిముసిగా నవ్వుకున్నాడు హరికృష్ణ.

"ఏమిటో బావగారు నవ్వుకుంటున్నారు మాకు చెబితే ఆనందాన్ని మేమూ పంచుకుంటాంగా?" అన్నది మరదలు.

హరికృష్ణ తొట్రుపాటును అణచుకున్నాడు.

"కాళ్ళూ చేతులూ కడుక్కోరూ?" అడిగింది భార్య.

తన భార్యకు, తను ఏ సమయానికి ఏం చెయ్యాలో ఏం కావాలో, ఏం చేస్తాడో తెలుసు, క్యాంపునుంచి తిరిగి రాగానే మొదట తను చేసేపని కాళ్ళూ చేతులూ కడుక్కుని బట్టలు మార్చుకోవడం, ఒకవేళ బద్ధకించినా తన భార్య జ్ఞాపకం చేస్తుంది.

ఆవిడ అలా ఎదురుగ్గా కూర్చోకపోతే లోపల ఏదన్నా పని చూసుకోకూడదూ? కనీసం ఆ ఉత్తరం తీసుకెళ్ళి బాత్ రూంలోనైనా చదువుకోవచ్చును!

చిన్న బుచ్చుకున్న మనసుతో బాత్ రూంలోకి వెళ్ళాడు.

బట్టలు మార్చుకొని తిరిగివచ్చే సరికి, హరికృష్ణ స్నేహితుడు సత్యనారాయణా, అతని భార్యావచ్చి కూర్చున్నారు. హరికృష్ణ అన్యమనస్కంగానే వాళ్ళను పలకరించాడు.

టీపాయ్ ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు. కళ్ళముందు పచ్చసిరా కవరు.

సత్యనారాయణా, అతనిభార్య, సరోజా మాటల్లో పడిపోయారు.

అవకాశం చూసి ఉత్తరం చేతిలోకి తీసుకున్నాడు. అది తీసుకుంటున్నప్పుడు, ఆ ఉత్తరం ఏమంత ఇంపార్టెంటు కాదన్నట్టు ముఖం పెట్టడానికి ప్రయత్నించాడు.

"ఇప్పుడే క్యాంపునుంచి వచ్చావా? ఇంకా ఉత్తరాలు కూడా చూసినట్టు లేవు" అన్నాడు సత్యనారాయణ.

హరికృష్ణకు వెనకనుంచి ఎవరో ఒక్క తోపు తోసినట్టయింది. చేతిలో వుత్తరాన్ని టీపాయ్‌మీదకు వదిలేశాడు. తొట్రుపాటును కప్పిపుచ్చుకుంటూ "అర్థ గంటయింది. వెర్రి ఇంపార్టెంటు ఉత్తరాలు ఏమీ లేవులే" అన్నాడు భార్య ముఖంలోకి చూస్తూ.

హరికృష్ణకు తన మాటలమీద ఎవరికీ నమ్మకం కుదరనట్టూ, తనకేసే పరీక్షగా అందరూ చూస్తున్నట్టూ అనిపించింది.

ఒక్కొక్క కవరూ తీసి చూసి, అదేమంత ఇంపార్టెంటు కాదన్నట్టు టీపాయ్ మీద విసిరేస్తూ....ఆ పచ్చకవర్ను ఉత్తరాల కిందకు చేర్చి రిలీఫ్‌గా ఫీలయ్యాడు.

సరోజ కళ్ళలోకి చూశాడు. సరోజ

హరికృష్ణ ముఖంలోకి గుచ్చిగుచ్చి చూస్తూ వుంది. హరికృష్ణకు వెన్నులో నుంచి ఏదో జరజర పాకినట్టయింది.

"ఇవ్వాళ కొంచెం అలసటగా వుంది" అన్నాడు హరికృష్ణ కళ్లు నలుముతూ.

సరోజ గబుక్కున లేచింది. కళ్ళు కూడా మిలమిల మంటున్నాయ్. వచ్చినప్పట్నుంచి చూస్తున్నాను.... టెంపరేచర్.... చూడండి."

"జ్వరం లేదు. కొంచెం తలనొప్పిగా వుంది."

"అమృతాంజనం రాయనా?"

హరికృష్ణకు చిరాకు వేసింది.

"ఏమీవద్దు. కాసేపు కళ్లు మూసుకొని పడుకొని చేరబడితే అదే పోతుంది" అంటూ కళ్ళు మూసుకున్నాడు హరికృష్ణ.

హరికృష్ణకు తన మూసుకున్న కళ్ళకు కూడా చూపు వచ్చినట్టనిపించింది. సరోజ తనకేసి ఆశ్చర్యంగా చూస్తున్నట్టు కనిపించసాగింది.

సరిగ్గా నెల రోజులైంది ఆమెతో పరిచయం కలిగి. ఆ రోజు ఆమె పాట పాడింది. ఆ సభకు తను అధ్యక్షత వహించాడు.

ఆమె గానం తనని ముగ్ధుణ్ణి చేసింది. అతి సాధారణమైన ఆమె రూపానికి, ఆ కళ ఓ విశిష్టతను తెచ్చిపెట్టినట్టు తనకు అనిపించింది. తను ఆమెన అభినందించాడు. ఆమె కళ్లు వెలిగిపోవడం తను స్పష్టంగా చూశాడు. ఆ కళ్ళ వెలుగు చెక్కిళ్ళమీదుగా జారి పెదవులమీద విరిసింది. ఆ వెలుగు తన హృదయానికి సులిపెచ్చగా తగిలింది. ఎంతోకాలంగా మూసివున్న గది కిటికీ రెక్కలన్నీ ఒక్కసారిగా తెరుచుకొని వెలుగు ప్రవేశించిన గదిలా అయింది తన మనసు.

ఈ నెల రోజులుగా ఏదో ఒక సమయంలో ఆమెను గురించి ఆలోచిస్తూనే వున్నాడు తాను.

తాను భ్రమపడటం లేదు గదా? కాదు-కాదు- తను ఊహిస్తున్నది వాస్తవం. ఆ కళ్లలోని వెలుగుకు అర్థం ఏమిటి? "మళ్లీ ఎప్పుడు వస్తారు ఈ ఊరు?" అని ఆమె ఎందుకు అడిగింది? ఆ ఉత్తరం చదువుకుంటే తన సందేహాలకు సమాధానం దొరుకుతుంది.

అప్రయత్నంగా కళ్లు తెరిచాడు. టీపాయ్‌మీంది ఉత్తరాల మధ్యగా ఆమె బొమ్మ కన్పించింది. చుట్టూ చూశాడు. అందరూ కబుర్లలో మునిగిపోయి వున్నారు.


గబుక్కున ఉత్తరంతీసి లాల్చీజేబులో పెట్టుకున్నాడు. దిగ్గునలేచి నిలబడ్డాడు.

"ఎందుకు లేచారు? తలనొప్పి ఎక్కువగా వుందా? ఎనాసిన్ వేసుకుంటారా?"

ప్రశ్నలవర్షం కురిపిస్తున్న భార్య హరికృష్ణకు బద్ధ శత్రువులా కన్పించింది.

"ఏం లేదు!" అంటూ కూర్చున్నాడు నౌకర్లేనాయె! ఆడవాళ్ళకు ఇంటి పని కూడా లేకపోతే, అలకరించుకొని మొగుళ్ల ఎదురుగా కూర్చుని వాళ్ళ ప్రాణాలు కొరుక్కు తింటారు. మగవాడు ఆఫీసు నుంచి అలసిపోయి వస్తాడనే జ్ఞానంకూడా వుండదు. కాసేపు మగవాడిని ఒంటరిగా వదిలెయ్యాలనే ఆలోచనే వుండదు.

ఎంత తెల్ల తోలయితే మాత్రం ఎప్పుడూ అందంగా కన్పిస్తుందా ఏం? బొడ్డు కిందకు చీరకట్టి సగం వళ్లు చూపించక పోతేనేం? ఎప్పుడూ పేరంటానికి బయలుదేరిన ముత్తైదువులా అలకరించుకొని కూర్చోకపోతేనేం?




హరికృష్ణ. సరోజ మళ్లీ కబుర్లలో పడిపోయింది.

హరికృష్ణ భార్యను పరీక్షగా చూస్తూ కూర్చున్నాడు. పది సంవత్సరాలగా తనతో కాపరం చేస్తున్న భార్య ఆ రోజు హరికృష్ణ కళ్ళకు కొత్త మనిషిలా కన్పించింది.

చక్కగా తల దువ్వుకొని, తలనిండా మల్లెపూలు పెట్టుకొని, తెల్ల జార్జెట్ చీరలో తెల్లగా కన్పిస్తోంది. హరికృష్ణకు చిరాకు వేసింది.

ఎప్పుడూ ఇంత టిప్‌టాప్‌గా వుండకపోతేనేమో? వేరే పనేముంది? ఇంటినిండా

పది సంవత్సరాలుగా తను ఎందుకు ఇదంతా గమనించలేదు? ఇవ్వాళ తనకేమైంది?

అనుకోకుండా ఎదురుగా వున్న అద్దం ముందుకెళ్ళి నిల్చున్నాడు. అక్కడక్కడ ఒకటి రెండు తెల్ల వెంట్రుకలు కన్పించినా ముఖంలో లేతతనం పోలేదు. అందరూ తనను అందమైనవాడనే అంటారు. మత్తుగా వళ్లు విరుచుకున్నాడు. మనసును ఏదో మత్తు చుట్టేసింది. అలవాటువల్ల దువ్వెన కోసం జేబులో చెయ్యి పెట్టుకున్నాడు. చేతికి ఉత్తరం తగిలి అదిరిపడ్డాడు. వెనుదిరిగి చూశాడు. తనను ఎవరూ గమనిం

పడంలేదని తెలుసుకొని రిలీఫ్‌గా సోఫాలో కూర్చున్నాడు.

మరీ తను ఇంత పరధ్యానంగా ఉండ కూడదు. వాళ్ళ చర్చలో పాల్గొనాలి. సరోజ ఆవలించకుండానే పేగులు లెక్క పెట్టే ఘటం! ప్రశ్నలు మొదలు పెడితే తను సమాధానాలు ఇవ్వలేక చావాలి.


హరికృష్ణ వాళ్ళ సంభాషణ వైపుకు మనసును మరలించాడు.

"ఆవిడ తొందరపడి ఆత్మహత్య చేసుకుంది. ఆడవాళ్లకు ఇదో రోగం మొగుడి మీద కొంచెం కోపంవచ్చినా, వంటికి నిప్పంటించుకొనో, బావిలోకి దూకో వస్తారు." అన్నాడు సత్యనారాయణ.

"సుఖంగా బ్రతకలేక!" అన్న సరోజ ముఖంలోకి లోతుగా చూశాడు హరికృష్ణ.

"రాఘవరావు నాకు బాగా తెలుసు. చాలా బుద్ధిమంతుడు. ఎలాంటి పరిస్థితులు అతన్ని మార్చాయో కొంచెం సానుభూతితో ఆవిడ అర్థం చేసికొని వుంటే ఇలా కాల్చుకు చావాల్సిన పని వుండేది కాదు. అయినా మీ ఆడవాళ్ళంతా.. అదే భార్యలు...ప్రతి భార్యా ప్రపంచంలోని ప్రతి ఆడదీ తన మొగుణ్ణి వళ్లో వేసుకోడానికే ప్రయత్నిస్తున్నట్టు ప్రతి వాళ్ళనూ అనుమానిస్తుంది" అన్నాడు సత్యనారాయణ.

"మగబుద్ధి పోనిచ్చావ్ కాదు. అభి



"భర్తే సర్వస్వం అనుకుంటూ నమ్మిన భార్యను మోసంచేసే మగవాడికి సంగతేమిటి? ఆడది భర్త తన్నినా, తిండి పెట్టకపోయినా భరిస్తుంది కాని మరో స్త్రీ అతని జీవితంలోకి ప్రవేశించటం భరించదు." ఉద్రేకంగా అన్నది సరోజ.

హరికృష్ణ తన తడబాటు అణచుకొనే ప్రయత్నంలో సోఫాలో వెనక్కు చేరబడి కూర్చున్నాడు.

"రత్నం నిజంగా రత్నంలాగే వుండేది. అటువంటి అందగత్తె భార్యగా వుండగా అతనికి అదేం పోయేకాలమో!" అన్నది సత్యనారాయణ భార్య.

మానం గల 'ఏ ఆడదైనా అదే పని చేస్తుంది.' జాగ్రత్త! నువ్వు నన్ను మోసం చేశావంటే నేను రత్నం లాగే కాల్చుకు చస్తాను. అన్నట్టుంది సత్యనారాయణ భార్య చెప్పిన తీరు.

సరోజ హరికృష్ణ ముఖంలోకి చూసింది. హరికృష్ణ మనస్సూ, శరీరం కుంచించుకు పోతున్నాయి. భార్య ముఖంలోకి చూడలేక కళ్ళు మరల్చుకున్నాడు.

ఆత్మహత్య! కిరసనాయిల్ పోసుకుని నిలువునా కాలిపోవడం! దారుణం! ఈ ఆడజాతే అంత! రాక్షస జాతి! మగవాళ్ళను కొరుక్కుతినే జాతి! మెళ్లో మూడు ముళ్ల వెయ్యగానే, తనకు పొనిన పత్రం రాసి ఇచ్చినట్టే భావిస్తారు.

పెళ్లాం తేనెటీగలాగ ఎప్పుడూ మొగుడి చుట్టూనే ప్రదక్షిణలు చేస్తూ వుంటే, మగవాడు ఏం కావాలి? అతనికి బయట అనేక పనులుంటాయి. అనేకమందితో పరిచయాలు ఏర్పడతాయి. వ్యక్తిగా అతనికీ ఏవేవో రహస్యాలు వుంటాయి. ప్రైవేటు జీవితం వుంటుంది.

హరికృష్ణ ధైర్యాన్ని కూడదీసుకుంటూ అన్నాడు.

"అనుమానమే ఆడదానికి శత్రువు. ఆ ఆత్మహత్య చేసుకున్న ఆవిడ గురించే ఆలోచించండి. మొగుడు జేబులో అసలు ఆవిడ ఎందుకు వెతకాలి? అలా చెయ్యక పోతే ఆ ఉత్తరం ఆవిడ చూడటం జరిగేది కాదు కాల్చుకు చచ్చేది కాదు." అన్నాడు హరికృష్ణ.

హరికృష్ణకు తన జేబులోని వుత్తరం బయటికి కన్పిస్తుందేమో ననే అనుమానం కలిగింది. తడిమి చూసుకున్నాడు.

"పాపం ఎప్పుడో ఒకప్పుడు బద్దలు కాకుండా పోతుందా ఏం? ఎంత దాచినా ఇటువంటి విషయాలు బయట పడకుండా వుండవు. ఆ వుత్తరం నిమిత్తమాత్రమే!" అన్నది సరోజ భర్త ముఖంలోకి చూస్తూ.

హరికృష్ణకు భార్య ఆ మాటలు తనను దృష్టిలో పెట్టుకొనే అన్నట్టు అన్పించింది. గతుక్కుమన్నాడు. సోఫాలో సర్దుకొని కూర్చున్నాడు.

"ఛీ! ఎంత సిగ్గుచేటు పని! పత్రికల్లో అతని పేరు అపరాధిగా పడటం! అరెస్టు కావడం! రేపు కేసునుంచి బయట పడొచ్చును. కాని వచ్చిన మచ్చ ఎక్కడకు పోతుంది?" అన్నది సత్యనారాయణ భార్య.

హరికృష్ణకు ఆ ఇద్దరు ఆడవాళ్లు కలిపి తన గొంతు పిసుకుతున్నట్టని పించింది.

"ఆడవాళ్లు అందుబాటులో వున్నప్పుడు ఏ మగవాడు అవకాశాన్ని జారవిడుస్తాడు?" అన్నాడు సత్యనారాయణ భార్యను ఉడికిస్తూ. సత్యనారాయణ భార్య,

భర్త ముఖంలోకి చురచురా చూసింది.

మరోసారి అయితే ఆ సంభాషణలో హాయిగా పాల్గొంటూ సరోజను ఉడికించేవాడు. కాని ఈ రోజు అతని అంతరాత్మ అల్లరి చేస్తూంది. గిల్టీ కాన్షస్‌తో ప్రతి దానికీ ఉలిక్కి పడుతున్నాడు. అతనికి వాళ్లు మాట్లాడే ప్రతి మాటా తనను దృష్టిలో పెట్టుకొనే మాట్లాడుతున్నట్టని పిస్తోంది. ఆ హాల్లో వున్న ఆరు కళ్ళూ తనను ఎక్సరే తీస్తున్నట్టనిపిస్తోంది!

"అలాంటి మగవాళ్ళని ఉరితియ్యాలి" సరోజ తీవ్రకంఠం హరికృష్ణకు కంకర రాయిలా తగిలింది.

"ఆ రత్నం స్థానంలో నేనున్నా అదే పని చేస్తామ" అన్నది మళ్ళీ సరోజ.

మాడుమీద సుత్తిదెబ్బ తగిలినట్టు దిమ్మెరపోయాడు హరికృష్ణ. జేబులోవున్న ఉత్తరానికి కాళ్ళువచ్చి జుబ్బజేబు బయటికి ప్రాకుతున్నట్టనిపించింది. లాల్చీ జేబు మీద చెయ్యిపెట్టుకొన్నాడు. భార్య ముఖంలోకి చూశాడు. ఆమె స్వెట్టర్ అల్లుకుంటూనే మాట్లాడుతోంది. సత్యనారాయణా, అతని భార్యాకూడా సంభాషణలో మునిగివున్నారు.

జేబులో ఉత్తరం.... సరోజ వెతకడం ఆత్మహత్య. పేపర్లలో పేరు. బోనులో నిల్చోవడం. వకీలు, జడ్జీలు... హరికృష్ణకు శరీరం చెమటతో ముద్దయింది.

తను బోనులో నిల్చున్నాడు. వకీలు వాదిస్తున్నాడు. ఒకొక్క విట్నెస్ సాక్ష్యం ఇస్తున్నారు. అందరూ తనకు వ్యతిరేకంగానే ఇస్తున్నారు. అందరూ బ్రతికున్న తనమీదకంటే చచ్చిన సరోజమీదే సాను భూతి ఎక్కువ చూపిస్తున్నారు. తన మరదలు, మామగారు, సత్యనారాయణ, అతని భార్య చివరకు తన క్యాంపు క్లర్కు కూడా తనకు వ్యతిరేకంగానే సాక్ష్యం ఇస్తున్నారు. ప్రతి ఒక్కరూ సాక్ష్యం ఇవ్వడానికి బోను ఎక్కుతూ తనకేసి తిరస్కారపూర్వకంగా చూస్తున్నారు. తన కళ్ళు ప్రతిసారి సిగ్గుతో వాలిపోతున్నాయి. అవమానంతో తలవంగి పోతుంది.

తన జేబులోని ఉత్తరం సరోజకు దొరికింది. సరోజ ఆత్మహత్య చేసుకుంటూ ఉత్తరం వ్రాసిపెట్టింది. తన ఆత్మహత్యకు కారణం తన భర్త ప్రవర్తనేనని రాసిపెట్టి మరీ చచ్చింది. తనకు శిక్ష తప్పదు, పేపర్లనిండా తన పేరే.

జేబులో ఉత్తరం పాములా చేతికి తగిలింది హరికృష్ణకు. అందరివైపూ ఒక సారిచూసి ఆ ఉత్తరం గబుక్కున టీపాయ్ మీద ఉత్తరాల మధ్యలో పెట్టేశాడు. "అమ్మయ్య!" అనుకున్నాడు రిలీఫ్‌గా.

ముఖంమీద పట్టిన చెమట తుడుచుకున్నాడు. ఆ ఉత్తరం అక్కడ వుండటం తన తప్పుకాదు. అంతగా సరోజ చూసినా పర్వాలేదు. ఎవరో రాసిన ఉత్తరానికి తను బాధ్యుడు కాదని చెప్పెయ్యవచ్చును. కాని ఆమె "మీ ఉత్తరం అందింది" అనిరాస్తే?

కణతలు అదిరిపోతున్నయ్! సోఫాలో వెనక్కువాలి కళ్లు మూసుకున్నాడు.

ఆమె రూపం కళ్లముందు కన్పించింది. వ్యంగ్యంగా నవ్వుతున్నట్టు కన్పించింది. తన పిరికితనాన్ని ఏవగించుకుంటున్నట్టు కన్పించింది.

ఆమెను గురించి ఆలోచించకూడదు. సుఖంగా వున్న ప్రాణాన్ని కష్టంలో ఎందుకు పడేసుకోవాలి? హాయిగా తనకు అలవాటయిన మార్గంలోనే ముక్కుకు సూటిగా వెళ్లిపోతాడు. ఇక ఆమెకు ఉత్తరాలు రాయడు. కాని.... ఒకసారి ఆ ఉత్తరము చదివితే .... ఆమె ఏం రాసిందో తెలుసుకుంటే.... ఇంతలోనే తనకుగానీ, తన భార్యకుగానీ వచ్చిన నష్టం ఏమిటి?

"ఇదిగో! ఈ మాత్ర వేసుకొని కాఫీ తాగండి!"

హరికృష్ణ ఒక్కసారిగా అదిరిపడ్డాడు. కాలికి టీపాయ్ తగిలింది. టీపాయ్ పక్కకు వరిగింది, దాంతోపాటు కాఫీకప్పు క్రిందకు దొర్లింది. కిందపడ్డ ఉత్తరాలు కాఫీలో తడిచిపోతున్నాయి.

"అరే! ఉత్తరాలు తడిచి పోతున్నాయ్!" అంటూ సరోజవంగి ఉత్తరాలు తీస్తుంది.

హరికృష్ణ జరిగిందేమిటో తెలుసుకొనే సరికే ఆ ఉత్తరం భార్య చేతిలో వుంది. హరికృష్ణకు సోఫాతోసహా భూమిలోకి వెళ్ళిపోతున్నట్టనిపించింది.

"అరే! ఈ కవరు తెరవనేలేదు. 'పర్సనల్' అనికూడా రాసివుంది." భార్య కవరు అందించింది.

హరికృష్ణ ఓ క్షణం భార్య చేతికేసి చూశాడు. అప్పుడే శరీరంనుంచి కోసి అందిస్తున్న తలను అందుకున్నట్టు ఆ ఉత్తరాన్ని అందుకున్నాడు హరికృష్ణ. కళ్ల ముందు రంగుల చక్రం గిర్రున తిరుగుతోంది, యాంత్రికంగా కవరు విప్పాడు.

తడిచిపోయినా ఆ కాగితంమీది అక్షరాలు అల్లుకుపోయి వున్నాయి. హరికృష్ణ కళ్లకు అసలు అది కాగితంలా కూడా కన్పించడంలేదు.

చేతిలో కాగితాన్ని వుండగానలిపి వేస్ట్ పేపర్ బ్యాస్కెట్‌లోకి విసిరాడు.

"అయ్యో అదేమిటండీ చదవకుండానే పారేశారు?" అన్నది సరోజ.

అన్నీ ఆరాలు తీస్తుంది. పనిలేక పోతే సరి!

"తడిచిపోయింది. పెద్ద ఇంపార్టెంటు ఉత్తరం కాదు లే." అన్నాడు సోఫాలో నిటారుగా కూర్చుంటూ.

"పర్సనల్ అని వ్రాసివుంది కదండీ? ఎవరైనా స్నేహితులు రాశారేమో?"

"ఇప్పుడు ముంచుకుపోయిందేముంది లే. ఏ రికమెండేషన్ కొరకో రాసి వుంటారు మళ్లీ రాస్తారు." సాధ్యమైనంత నిర్లక్ష్యాన్ని ముఖంలోకి తెచ్చిపెట్టుకుంటూ అన్నాడు హరికృష్ణ.

"సరే! పద! పద! ఆకలేస్తుంది." భార్యకు మరో ప్రశ్నవేసే అవకాశం ఇవ్వకుండా లేచి నిల్చున్నాడు హరికృష్ణ.

"అవును! చాలా ఆలస్యం అయింది. రండి!" అంటూ లోపలకు వెళ్లింది సరోజ.

హరికృష్ణ ఓసారి చిత్తు కాగితాల బుట్టలోకి చూసి నిట్టూర్చాడు.

"పెద్ద ఆలస్యం ఏమీకాలేదు. నన్ను నేను త్వరగానే తెలుసుకున్నాను" అనుకుంటూ హరికృష్ణ భార్య వెనకే లోపలకు వెళ్లాడు.

మనసు తేలిక పడింది. డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్న హరికృష్ణకు ఓ సందేహం కలిగింది.

అసలు ఆ ఉత్తరం ఆమె వ్రాసిందేనా అని....

★★★